www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 2 మే 2023
5
అన్నమయ్య



వాడవాడలా మేడే సంబరాలు



మదనపల్లె : జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

5లో

ధర ఘనం.. ఫలం స్వల్పం



మామిడి కాయలకు మందు పెడుతున్న కూలీలు

- అమ్మితే తక్కువ.. కొంటే ఎక్కువ
- వ్యాపారులు, దళారులదే రాజ్యం
- విపత్తులతో పంటలకు భారీదెబ్బ
- తీవ్రంగా నష్టపోతున్న రైతన్నలు



ప్రజాశక్తి - రాయచోటి

తియ్యతియ్యగా..పుల్లపుల్లగా.. తింటుంటే మరిన్ని తినాలపించే సీజనల్ పండ్ల ఉత్పత్తి ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. రిటైల్‌గా వాటి రేట్లు మాత్రం అదిరిపోతున్నాయి. ఆరోగ్యానికి మంచి చేసే సీజనల్ పండ్ల ధరలకు రెక్కలు మొలిచాయి. డజను పండ్లు ఎంత అని అడిగి.. అరడజను కొని సంతృప్తిపడాల్సిన పరిస్థితి. పండ్ల మార్కెట్‌లో ధరలు అంతలా మండి పోతున్నాయి. ప్రస్తుత సీజన్‌లో మామిడి, బత్తాయి, అరటి, చక్రకేళి, నిమ్మ, బొప్పాయి, సపోట వంటి పండ్ల ఉత్పత్తి బాగా తగ్గిపోయింది. వాటి ధరలు బాగా ప్రియంగా ఉన్నాయి. ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో పండ్ల తోటలన్నీ దెబ్బతిని, పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఈ కారణంగా పండ్ల ఉత్పత్తులు మార్కెట్‌కు రావడం తగ్గిపోయింది. విచిత్రంగా పండ్ల మార్కెట్లు వెలవెలబోతుంటే..పండ్ల ధరలు మాత్రం భగ్గుమంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలో 89,657 ఎకరాలలో మామిడిని పంటను సాగైంది. ముఖ్యంగా రైల్వేకోడూరు, రాజంపేట, పెనగలూరు, చిట్వేలి, గాలివీడు, చిన్నమండెం, కలకడ, కలికిరి, పీలేరు, కె.వి.పల్లి, వాయల్పాడు ప్రాంతాల్లో రైతులు అధికంగా మామిడి తోటలు వేశారు. ఈ సారి కాపు బాగా వచ్చి ఆదాయం పొందవచ్చని ఆశించారు. ఇటీవల కురిసిన అకాల వర్షం వల్ల పూత రాలిపోవడంతో అనుకున్నంత స్థాయిలో పంట రాకపోవడంతో రైతులు కుదేలయ్యారు. అంతో ఇంతో పంట కాపుకొచ్చిన్నప్పటికీ కొంత మేరకు తెగుళ్ల రావడం వల్ల పంట కొంత దెబ్బతింది. అయినప్పటికీ మార్కెట్‌లో మామిడి కాయలు వివిధ ప్రాంతాల నుంచి రాయచోటి మండీలకు చేరుకున్నాయి. వ్యాపారులు కొనేవారిని ఆకర్షించే విధంగా కార్బైడ్ అనే ద్రావణంలో కాయలు ముంచి మాగా పెడుతుంటారు. మరికొందరు వ్యాపారులు త్వరితగతిన కాయలు మాగేలా కార్బైడ్‌ను పొట్లంలో కట్టిపెట్టి మామిడికాయల బాక్సులు పెట్టడం వల్ల రెండు రోజులకే అవి మంచి వర్ణం వస్తాయి. అలాంటి మామిడి పండ్లను మార్కెట్లో వ్యాపారులు తోపుడు బండ్ల గంపల్లో పెట్టి కేజీ రూ. 80 నుండి వంద చొప్పున విక్రయిస్తున్నారు. మామిడి పంట సాగుకు అధిక ఖర్చులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది పంట కూడా సరిగ్గా రాలేదని వ్యాపారస్తులు కూడా కొనడానికి ముందుకు రావడంలేదని వాపోతున్నారు. వచ్చిన అరకొర కాయలను వ్యాపారస్తులు మామిడికాయలు రేట్లు లేవని రైతుల దగ్గర అతి తక్కువ రేటుతో తీసుకొని మార్కెట్లలో అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. మామిడి పండ్లు రంగులో ఉన్నప్పటికీ తింటే అంత రుచిగా ఉండటం లేదు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులు చెట్లకు మాగిన పండ్లను గడ్డి, బోధ వంటి మధ్యలో కాయలు పెట్టి మగ పెడతారు. అవి ఎంతో రుచిగా రంగుతో తినడానికి ఆరోగ్యకరంగా ఉంటాయి. కానీ నేడు మార్కెట్లో రసాయానాలతో మాగిన పెట్టి పండ్లను విక్రయిస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కానీ ఫుడ్ కంట్రోల్ అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. రాయచోటి నుంచి బెంగళూరు, ముంబాయి, చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు మామిడి పండ్లు కాయలు ఎగుమతి అవుతున్నాయి. ఎక్కువగా బెనిష, మలుగూబ, బెంగళూరు, రాళ్లవారి మామిడికాయలు ఎక్కువ సంఖ్యలో రైతులు పండిస్తున్నారు.

మామిడి తోటలపై ఆధారపడి జీవిస్తున్నాం

గ్రామీణ ప్రాంతాలలో చాలామంది రైతులు మామిడి తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నాం. నాలుగేళ్లుగా సరైన ఆదాయంలేదు. మామిడి తోటలకు దున్నడం, చెట్లకు పాదులు తీయడం, నీరు కట్టడం, ఎరువులు, మందులు, కూలీలు ఖర్చులు అధికమయ్యాయి. గత సంవత్సరం గాలి, వర్షాల వల్ల మామిడి కాయలు రాలిపోయి చెట్లు కూడా విరిగిపోయాయి. వాటికి నష్టపరిహారం కూడా ఇవ్వలేదు. ఈసారైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం రైతులకు అందించాలి.



- రమణారెడ్డి, రైతు, మాధవరం, రాయచోటి.

ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య జయంతి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా కేంద్రంలో పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని వేడుకగా నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, నాయకులు ఎస్. ఫయాజ్, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, నాయకులు వి.సిద్దమ్మ, పి.సురేఖ జె.శంకర్ ఆధ్వర్యంలో దక్షిణభారత కమ్యూనిస్టు ఉద్యమనిర్మాత, కమ్యూనిస్టు గాంధీ బడుగు బలహీనర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో ట్రాఫిక్ ఎస్ఐ రఫీక్ చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల జయంతి సంధర్బంగా రోగులకు ఉచితంగా పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేయడం అభినందనీయ అన్నారు. నిరంతరం పేదలకోసం వారి హక్కులకోసం జీవితాంతం నిర్విరామంగా కృషి చేసిన మహామనిషి సుందరయ్య అని కొనియాడారు. నాడు పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లిన ఒకే ఒక్క నిరాడంబర ప్రజానాయకులు సుందరయ్య అని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమం కోసం బిడ్డలను సైతం వద్దనుకొని కడవరకు ప్రజా ఉద్యమాల కోసం పనిచేశారని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి అన్యాక్రాంతం అయినలక్షలాదిఎ కరాల భుములను రజకార్ల నుంచి స్వాధీనం చేసుకుని పేదలకు పంచారని చెప్పారు. తన యావదాస్తిని పార్టీకోసం రాసిచ్చిన, నిస్వార్ధ ప్రజా నాయకులు వారని వారు గుర్తుచేశారు. నదీజలాల సమస్యకు పరిష్కారం ఆనాడే సూచించాడని వారు అన్నారు. సుందరయ్య కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఆస్పత్రిలో రోగికి పండ్లు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రఫీక్



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష


ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ గిరీష సూచించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు కలెక్టర్ స్వీకరించారు. అర్జీల స్వీకరణలో డిఆర్ఒ సత్యనారాయణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిశితంగా పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ రాకుండా, ఆ సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నామో అర్జీదారుడికి వివరంగా చెప్పాలన్నారు. అర్జీ పరిష్కారం తమ పరిధిలో లేనప్పుడు ఆ అర్జీని సంబంధిత అధికారికి బదలాయించాలన్నారు. స్పందన అర్జీలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని చెప్పారు. రోజూ స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు అందరూ కొంత సమయం కేటాయించాలని సూచించారు. బాధితులకు సత్వరం న్యాయం చేయడమే లక్ష్యంగా సమస్యలను పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చే దరఖాస్తు బియాండ్ ఎస్-ఎల్ఏ లోకి వెళ్లకుండా సంబంధిత శాఖ అధికారితో సమన్వయం చేసుకొని సంతప్తికర స్థాయిలో నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు వినతిపత్రాలు అందజేశారు.

ఐఎఎల్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - రాయచోటి



ఈశ్వర్, ఖాదర్‌బాష

కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల ఐఎఎల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం అఖిలభారత న్యాయ వాదుల సమాఖ్య -ఇండియన్ అసోసియేషణ్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) 6వ మహాసభ సందర్భంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులు ఈశ్వర్, సహ కార్యదర్శిగా మిఠాయగిరి ఖాదర్‌బాష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను పలువురు న్యాయవాదులు అభినందించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బత్యాల చెంగల్రాయుడు

అవినీతికి కేరాఫ్ అడ్రస్ జగన్ : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జగన్‌రెడ్డి ఓ చాకచక్యమైన క్రిమినల్ అని, తనతో ఉన్న వారిని ప్రలోభ పెట్టి, వారిచే నేరాలు చేయించి చేయి దులుపుకుంటారని, సొంత బాబాయి హత్యకు అండగా నిలబడిన హంతకుడు జగన్ అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు ఆరోపించారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ అవినీతిని ఎండగడుతూ జగనాసుర అనే పత్రాన్ని ఆవిష్కరించి జగన్ పాల్పడిన అవినీతి, అక్రమాలను ఎండగడుతూ ఒక్కొక్క పత్రాన్ని చింపుతూ వినూత్న పద్ధతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ తండ్రి మరణాన్ని కూడా రాజకీయంగా వాడుకున్న నీచుడన్నారు. జగన్ ఆర్థిక క్రిమినల్ అని, అధికారులతో దొరకకుండా ప్రజలను మభ్యపెడుతూ ఎలా తప్పించుకోవాలో ఆయనకు బాగా తెలుసని అన్నారు. అక్రమాస్తుల కేసులో సిబిఐ రూ 43 వేల కోట్లు వెలకట్టగా ఎన్నికల అఫిడవిట్లో కేవలం రూ 510 కోట్లు చూపించిన ఏ వన్ ఖైదీ అని విమర్శించారు. విశాఖపట్నంలో వేల ఎకరాల భూమిని ఆక్రమించి అమరావతిలో వేయికి పైగా ఎకరాల భూమిని దారిమల్లించి తాను పుట్టిన రాయలసీమలో కూడా భూధందాకు పాల్పడిన భూమాపియా జగన్ రెడ్డి అని అన్నారు. లిక్కర్ మాఫియా, మైనింగ్ మాఫియా, ఇసుక మాఫియా కు పాల్పడి రాష్ట్రాన్ని దోచుకు తింటున్న బకాసురుడని ఆరోపించారు. మహిళలపై నేరాలకు పాల్పడిన ఐదుగురు ఎమ్మెల్యే, ముగ్గురు ఎంపీలను ఎన్నికల రంగం లోకి దించారని, జగన్ రెడ్డి కీచక పాలనలో రాష్ట్రంలో ప్రతి ఎనిమిది గంటలకు ఒక మహిళ అత్యాచారానికి గురవుతోందని జగన్ ఒక స్త్రీ వ్యతిరేకన్నారు. జగన్‌రెడ్డిది భస్మాసుర హస్తమని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, పాదాధికారులు పాల్గొన్నారు.

డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన చైతన్య

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



రాజంపేట డిఎస్పీగా వి.ఎన్.కె.చైతన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిఎస్‌పికి రాజంపేట డివిజన్లోని సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. డిఎస్పి చైతన్య తాడిపత్రి నుంచి రాజంపేటకు బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డిఎస్‌పి శివ భాస్కర్‌రెడ్డి ప్రభుత్వానికి రిపోర్ట్ చేయనున్నారు.

ఇంటింటికీ ఉచిత ఆరోగ్య సేవలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ఇంటింటికీ ఉచిత ఆరోగ్య సేవలు అందించాలని కలెక్టర్ గిరీష సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్‌లో ఎన్‌సిడి-సిడి సర్వే, అనిమీయా, ఎఎన్ఎం ఫీడ్ బ్యాక్, కోవిడ్ టెస్టింగ్, కంటి వెలుగు, తదితర అంశాలపై వైద్యాధికారులతో వీడియాకాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో జనరల్ ఒపిసంఖ్యను గణనీయంగా పెంచడంతోపాటు ఎప్పటికప్పుడూ డేటా ఎంట్రీ చేయాలన్నారు. ఎఎన్ఎం ఫీడ్ బ్యాక్ సబ్మిషన్ పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలన్నారు. సీరియస్‌గా తీసుకొని గడువులోగా ఎఎన్ఎం ఫీడ్‌బ్యాక్ గ్రీవెన్స్ పూర్తి చేయాలన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులను డిప్యూటీ డిఎంహెచ్ఒలు తరచూ సందర్శించాలన్నారు. 15 రోజుల నుంచి కోవిడ్ యాక్టివ్ కేసులు జీరో ఉందన్నారు. . ర్యాపిడ్ టెస్ట్ కాకుండా కోవిడ్ లక్షణాలు ఉన్నవారికి ఆర్ టిపిసిఆర్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఎన్ సిడి-సిడి సర్వేలో భాగంగా ప్రతి పౌరుడి వివరాలు, హెల్త్ ఐడి జనరేట్ చేయాలన్నారు. ఎఎన్ఎంలు తమ పరిధిలో ఉన్న వారికి బిపి, బ్లడ్ గ్లూకోస్, హిమోగ్లోబిన్, బాడీ మాస్ ఇండెక్స్ పరీక్షలను చేయడంతోపాటు ఎన్ సిడి -సిడి సర్వే కేసెస్ మీద ప్రత్యేక దృష్టి పెట్టి వైద్య సేవలు అందించాలన్నారు. డయాబెటిస్, తదితర పేషెంట్లను డాక్టర్లు కచ్చితంగా పరీక్షలు చేయాలన్నారు. సచివాలయం తనిఖీ చేసినప్పుడు ఆ సచివాలయం పరిధిలో గర్భిణులకు వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం డేటా ఎంట్రీ తప్పకుండా చేయించాలన్నారు. అనీమియా పేషెంట్లను స్క్రీనింగ్ చేసిన తర్వాత డేటా ఎంట్రీ చేయాలన్నారు. అనీమియా టెస్ట్ పకడ్బందీగా చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు సమీక్షలో డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

'కోర్టు తీర్పుకు లోబడి డైరెక్టర్‌ను నియమించాలి'



మాట్లాడుతున్న ఆరోగ్యవరం మెడికల్ డైరెక్టర్ వెస్లీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్ నియామకంలో కోర్టు తీర్పులకు లోబడి నూతన డైరెక్టర్ నియమించాలి కానీ క్రిస్టియన్ కమ్యూనిటీ మనోభావాలను కాపాడవలసిన బిషప్ ఏకపక్ష నిర్ణయాలు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌కు ఇబ్బందిగా మారాయని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ బి.వెస్లీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆరోగ్యవరం సెంట్రల్‌లోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌పై ఆధిపత్యం కోసం అడ్డదిడ్డంగా కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. గౌరవంగా తాను తప్పుకోవడానికి ఎప్పుడూ సిద్ధమే అనే విషయాన్ని స్పష్టంగా వెల్లడించారు. కోర్టు తీర్పులకు లోబడి నూతనంగా డైరెక్టర్ నియమించాలని పేర్కొన్నారు. కొంతమంది అల్లరి మూకలు ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ వద్ద అలజడి సృష్టించడానికి చేస్తున్న ప్రయత్నాలు అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. ఆరోగ్యవరం వద్ద పోలీసు భద్రతా అవసరం వుందని తెలిపారు. దీనిపై పోలీసు శాఖ వారికి లేఖ రాస్తామని వివరించారు. సుధీర్ఘ చరిత్ర కలిగిన ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ వివాదాలకు నిలయంగా మారడం భాదకరమని ఆవేదన చెందారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌పై పూర్తి హక్కులు ఆరోగ్యవరం వరానికే వున్నాయని ప్రభుత్వానికి కానీ, బిషప్‌కు కానీ లేవని తెలిపారు. సమావేశంలో ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ పాల్గొన్నారు.

10లోగా హద్దురాళ్లు నాటాలి : గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఈనెల 10 లోగా హద్దు రాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి రాష్ట్ర సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ జగనన్న భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా హద్దురాళ్ల పాతే అంశంపై కలెక్టర్లు జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా సర్వే పూర్తయిన గ్రామాలలో హద్దురాళ్లను తప్పనిసరిగా పాతించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు రోజూ ఎన్ని రాళ్లు వస్తున్నాయి, క్షేత్రస్థాయికి ఎన్ని పంపుతున్నారు, ఒక్కరోజులో ఎన్ని రాళ్లు పాతుతున్నారు, ఇంకా ఎన్ని రాళ్లు అవసరం అవుతాయి అన్న విషయాలపై ఆయన సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న భుహక్కు- భూరక్ష పథకంలో భాగంగా మొదటి దశలో రీ సర్వే పూర్తయిన 84 గ్రామాలలో దాదాపు 70 వేలకు పైబడి హద్దురాళ్లు నాటే కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా సరైన కార్యాచరణ రూపొందించుకొని విజయవంతం చేయాలన్నారు. రీసర్వేకు సంబంధించి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, పార్టీషన్, సబ్ డివిజన్‌లలో పక్కా వివరాలు రూపొందించుకొని, నాణ్యతగా రీసర్వే పూర్తి చేయాలన్నారు. ఎల్‌పిఎం సంఖ్య మేరకు ఎన్ని హద్దురాళ్ళు అవసరం అవుతాయో అన్న సంఖ్యను రాష్ట్రస్థాయి అధికారులకు పంపామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాకు ఎన్ని రాళ్లు వచ్చాయి, ఇంకెంత అవసరం అన్న విషయంలో పక్కా సమాచారాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు పంపాలని సర్వే శాఖ ఏడిని ఆదేశించారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ సత్యనారాయణ, సర్వే శాఖ ఏడి జయరాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

జెవివి వేసవి వినోదం

ప్రజాశక్తి- కడప అర్బన్

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేసవి వినోద కార్యక్రమం సోమవారం రవీంద్ర నగర్‌లోని విద్యానికేతన్ స్కూల్‌లో ప్రారంభించారు. కార్యక్రమానికి విద్యార్థులతో పాటు అనేక రంగాల్లో నిష్ణాతులైనటువంటి టీచర్లు పాల్గొన్నారు. హిందీ టీచర్ షామీర్ బాషా కొన్ని మ్యాజిక్ ట్రిక్స్ ప్రదర్శించారు. తెలుగు టీచర్ జి గౌరీ శంకర్ పిల్లలకు కొన్ని నీతి పద్యాలు వాటి వివరణ ఇచ్చారు. జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఈ విశ్వ పరిణామ క్రమం అందులో భూమి పాత్ర లాంటి అనేక విషయాలు వివరించారు. మే చివరి వవరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలకు డాన్స్, పాటలు, ఒరిగామి, చేతిరాత, క్రాఫ్ట్, మ్యాజిక్ లాంటి అనేక విషయాల పట్ల అవగాహన కల్పించడం, వారికి నేర్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నగర కమిటీ ఉపాధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా, రామాంజనేయులు, కిరణ్, శ్రీనివాసరాజు, చంద్రకళ, గౌరీ శంకర్, మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవార్డు పొందడం ఆనందదాయకం

కడప: అంబేద్కర్ అవార్డు పొందడం చాలా అదృష్టంగా తాను భావిస్తున్నట్లు దాదాస్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ పీఎం రవికుమార్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ నగర కమిటీ అధ్యక్షులు పాస్టర్ సుధీర్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రకాష్ నగర్‌లో ఉన్న ఆ ఫెడరేషన్ కార్యాలయంలో నగర కమిటీ ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా దాదాస్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ హాజరయ్యారు. అనంతరం ఆయన్ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు. జోసెఫ్, ప్రభు దాసు, విజయ శేఖర్, జ్ఞానానందం, సందీప్ రాజు. అలాగే నగర కమిటీనాయ కులు. సుధీర్, డేవిడ్ రాజు,జాన్సన్, వినోద్,అమర్, అబ్రహం, సిస్టర్స్, అమ్ములు, పుష్ప పాల్గొన్నారు.

వైభవోపేతంగా బ్రహ్మంగారి రథోత్సవం

బ్రహ్మంగారి మఠం : అశేష జనవాహిని మధ్య సోమవారం బ్రహ్మంగారి రథోత్సవం వైభవంగా కొనసాగింది. ఐదురోజుల రోజులపాటు నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు రథోత్సవ కార్యక్రమంతో బ్రహ్మంగారి మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. విద్యుత్ దీపలంకరణ భక్తులకు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు.



కురవల అభివృద్ధికి దోహదపడదాం

ప్రజాశక్తి - రాయచోటి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రాష్ట్ర కురువల అభివృద్ధికి దోహదపడదామని కురవకుల రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లైన్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మదనపల్లి మార్గంలోని మదనపల్లి గోవిందు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న మదనపల్లి మార్గంలోని సుధా కల్యాణమండపం దగ్గర జిల్లా కురవకుల అభివృద్ధి కమిటీ ఎన్నుకుంటామన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ 14న సమావేశమై జిల్లా అభివృద్ధి కమిటీకి కమిటీలో పాల్గొని అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవిశంకర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రెడ్డన్న, చౌడయ్య, ఈశ్వరయ్య, సుధాకర్, గోవింద్, మురళి ,నాగయ్య, రఘు పాల్గొన్నారు.

'పెండింగ్ పనులను పూర్తి చేయాలి'

ప్రజాశక్తి- రాయచోటి

గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన పెండింగ్ పనులను పూర్తి చేయాని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గ్రామ వార్డు సచివాలయాలు, స్పందన, రీ సర్వే, హౌసింగ్, ఎన్నికలు, తదితర అంశాల మీద జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు మ్యాపింగ్‌లో ఉన్న లోపాలను సవరించాలని, సంపూర్ణ పోషణ కార్యక్రమానికి సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వేకు సంబంధించి, ఎస్ఎల్ఏ దాటినవి ఉండకూడదని, ఓటీఎస్, భూహక్కు భూ రక్షా మీద దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల గురించి సమీక్షిస్తూ కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికలలో చెల్లని ఓటర్ కార్డులు చాలా బయటపడ్డాయని, అటువంటివి మన జిల్లాలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని, వాటిని మళ్లీ రీఓపెన్ చేయకుండా ఉండేలా పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు . కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

5న కాలభైరవ స్వామి తిరుణాల

ప్రజాశక్తి - రాయచోటి

మండలంలోని యండపల్లిలో శ్రీ కాలభైరవ స్వామి తిరుణాల ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పోలు సుబ్బారెడ్డి, బుడ్డా ధర్మారెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు . మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రాత్రి 9 గంటల నుండి విద్యుత్ దీపాలంకరణలు ,మేళతాళాలు, ఆర్కెస్ట్రాల్లు, చాందిని బండ్లు ఏర్పాటు చేశామన్నారు. 6న ఉదయం మైలు తరుణాల నిర్వహిస్తామన్నారు. తిరుణాల మహోత్సవానికి భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పేర్కొన్నారు.

వాడవాడలా మేడే సంబరాలు


రాయచోటి : ర్యాలీ చేస్తున్న కార్మికులు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని కార్మికులు, శ్రామికులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వామపక్షాలు, వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా వాడవాడలా అరుణ పతాకం రెపరెపలాడింది. రాయచోటి, మదనపల్లెలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మికులు ఎర్రజెండాలు చేతబట్టి ఎక్కడికక్కడ దండుగా కదిలారు. ప్రదర్శనలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై నిప్పులు చెరిగారు.

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పని గంటలు పెంచి కార్మిక హక్కులపై దాడి చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను పోరాటాల ద్వారా అడ్డుకోవాలని, మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్ లను తిప్పి కొట్టడానికి ఐక్యంగా పోరాడాలని సిపియం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అయిన మేడే సందర్భంగా వాడవాడలా ఎర్రజెండా రెపరెపలాడింది. గ్రామీణ ప్రాంతాల్లో 38 చోట్ల సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే ను ఘనంగా నిర్వహించారు. సిఐటియు అనుబంధ సంఘాలు అంగన్వాడీ, ఆశా, ఆటో, హమాలీ, భవన నిర్మాణ కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు మేడే కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రతిజ్ఞ చేశారు. జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.హరిశర్మ, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్వరి, సిపియం పట్టణ కార్యదర్శి డి.ప్రభాకర్‌రెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యం.జయమ్మ, సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎ.వెంకటేష్, హమాలీ యూనియన్ నాయకులు రమణరావు, భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు జయరాంలు వివిధ ప్రాంతాల్లో ఎర్రజెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినాల కోసం 136 సంవత్సరాల క్రితం చేసిన పోరాటం ఇప్పటికీ, ఎప్పటికీ కార్మికులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పనిగంటలను ఎనిమిది నుంచి పన్నెండు, పదహారు గంటలకు పెంచాలని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కాంట్రాక్టు విధానాన్ని ప్రోత్సహిస్తూ లక్షలాది ఖాళీలను భర్తీ చేయడం లేదని, ప్రభుత్వ రంగ రిక్రూట్‌మెంట్ చేయడం లేదని అన్నారు.మతోన్మాద ప్రచారాలు, మతపరమైన అల్లర్లు, సృష్టించి దేశ ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. మత విద్వేషం, ఉన్మాదం, ద్వేషపూరిత రాజకీయాల నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మి కవర్గానికి ఉందని గుర్తు చేశారు. సంఘ్ పరివార్ శక్తుల ప్రయత్నాలను ప్రతిఘటించేందుకు పోరాటాలను జయప్రదం చేయాలన్నారు. సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరి శర్మ మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను దెబ్బతీయాలని చూస్తోందని పని గంటలు పెంచి కార్మిక హక్కులపై దాడి చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను పోరాటాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికులు హక్కుల రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపియం నాయకులు సాహిన, నాగరాజు, చంద్ర, లోకేష్, సురేంద్ర, సిఐటియు నాయకులు నాగరాజు, వెంకటరమణ, శివ, రెడ్డెప్ప తదితరులతో పాటు వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. **జిల్లా ఆస్పత్రిలో..** పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో ఎఐటియుసి నాయకులు జి.కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. అనేకమంది తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించి శ్రమదోపిడీపై విజయం సాధించారన్నారు. కార్యక్రమంలో కార్మికులు ఎం. పాండు రంగయ్య, గిరిబాబు, సురేష్, పార్వతి, అలివేలు, ఆదిలక్ష్మి, గుంటి, లక్ష్మి, శ్రీనివాసులు, స్వామి నాథం, రెడ్డెప్ప, వనజ, మనోహర, రెడ్డి, అథం, మౌలాలి, థిలాసి రమణ పాల్గొన్నారు. **బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బివి.రమణ, కార్యదర్శి ఎస్.రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.మోదీన్‌బాషా, ఉపాధ్యక్షులు పి.రామాంజులు, పెయింటర్స్ యూనియన్, రాడ్ బెండర్స్ యూనియన్, కార్పెంటర్స్ యూనియన్, టైల్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. **కార్మికులకు ఘన సన్మానం..** పట్టణంలోని శ్రీవారి గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులను మేడే సందర్భంగా జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనియర్ గంగారపు రాందాస్‌చౌదరి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐటిఐ విభాగ నాయకులు జగదీష్ , మదనపల్లె రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, జనార్ధన్ రెడ్డమ్మ పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** 137వ అంతర్జాతీయ


రాయచోటి : మేడే నినాదాలు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

కార్మిక దినోత్సవ వేడుకలు రాయచోటి పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో ఐసిడిఎస్, విద్యుత్, బస్టాండ్, మున్సిపల్ కార్యాలయాల ఆవరణలో ఆరు చోట్ల సిఐటియు శ్రేణులు జెండా వందనం చేసి అమరవీరులకు నివాళి అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లడుతూ నాడు కార్మికులు చికాగో నగరాల హే మార్కెట్ వద్ద పక్కటె ముకలు పగిలినా ప్రాణాలు పోయినా ఎనిమిది పనిగంటలు పని సాధించారని అన్నారు. కనీసవేతనం ఇఎస్ఐ, పిఎ, గ్రాట్యుటీ రిటైర్మెంట్ భెనిఫిట్స్, వేతనసవరణ వంటి నలభై నాలుగు రకాల కార్మిక సంక్షేమం కొరకు చట్టాలు హక్కులు సాధించారని నేటి ప్రభుత్వాలు యాజమాన్యాలకు అనుకూలంగా లేబర్ కోడ్లు తీసుకుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యా లయం నుంచి తహశీల్దార్ కార్యా లయం మీదుగా ర్యాలీ నిర్వ హించి మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి రాంబాబు, విజయమ్మ, సిద్దమ్మ, సుమలత, ఇందిర, నాగమణి పార్వతి, సుబ్బమ్మ, సరస్వతి, సబీనా, లక్ష్మీ, ప్రసన్న, ఆశా రమాదేవి, అరుణ, సురేఖ, వైవి.రమణ, తిరు పాల్, సిద్దయ్య అశోక్, సురేంద్ర, రాజమ్మ పాల్గొన్నారు.**కలకడ :** మండల కేంద్రమైన కలకడలో 137వ శ్రామికుల దినోత్సవం సందర్భంగా మేడేని జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించుకున్నారు. దేశంలో శ్రామికుల కష్టాలని ఎప్పటికీ ఎవరు గుర్తించలేని దయనీయ సంఘటనగా మారిందని సిఐటియు అనుబంధ సంస్థ పంచాయితీ కార్మికుల మండల అధ్యక్షులు హరి కొనియాడారు. ఇకనైనా ప్రభుత్వాలు కష్టజీవుల శ్రమను గుర్తించి వారికి శ్రమకు తగిన ఫలితం ఇచ్చేందుకు చొరవ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు రెడ్డప్ప , నటరాజ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. **పీలేరు :** పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, ఆర్‌టిసి డిపో, ఆటో స్టాండ్‌ల వద్ద ప్రాంతాల్లో కార్మిక నాయకులు, కార్మికులు సంయుక్తంగా ఎర్రజెండాలు ఎగురవేశారు. కార్మిక స్వేచ్ఛా గీతాలాపన, నినాదాలు, వక్తలు అందించిన సందేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సదాశివరెడ్డి, చంద్రశేఖర్, చంగల్ రాయుడు, జి. రాధాకృష్ణ, శంకరయ్య, వైసిపి నాయకులు కంభం భాస్కర్‌రెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ రాష్ట్ర నాయకురాలు చిన్నమ్మ, వైసిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు మహిత ఆనంద్ పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా కార్మికులు తహశీల్దార్ కార్యాలయం నుంచి గేటు వరకు ర్యాలీగా వచ్చి గేటు దగ్గర జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గరుగుపల్లి విఆర్‌ఒ సుధాకర్, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఓబులమ్మ, విఆర్‌ఎల జిల్లా కార్యదర్శి సభ్యుడు భోగీశ్వరయ్య, సిఐటియు మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సురేష్ కుమార్ అమీన్‌పీర్, రామాంజులు, మల్లికార్జున, దిల్షాద్ బేగం, రాణి, కార్మికులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పెద్దతిప్ప సము ద్రం గ్రామపంచాయతీ ఎంఆర్‌సి ప్రాంగణంలో మే డే సదర్భంగా గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర, అంగన్వాడీ వర్కర్స్ నాయకులు నలిని, శాంతమ్మ, శ్రీవాణి, ఈశ్వరమ్మ, సరస్వతి రాణి, అంజలి, సురేంద్ర, పంచాయతీ కార్మికులు రమణ, రామచంద్ర, ఆదెమ్మ, లక్ష్మి,నాగరాజు ,యస్.లక్ష్మి, హమాలీ కార్మికులు శంకర, రామాంజిలు పాల్గొన్నారు.యువతకు ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ విధానాలు రద్దు చేయాలని,12 గంటల పని విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, పెట్రోల్,డీజిల్, వంట గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలపై జరుగుతున్న దాడులు ఆపాలన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని, పోలవరం, రాజధాని నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, భారీగా ప్రజలపై మోపిన ఇంటి పన్నులు, చెత్త పన్నులు, ఖాళీ స్థలాలపై పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు., విద్యుత్ ఛార్జీలు, ఆర్‌టిసి ఛార్జీలు తగ్గించాలని నినాదులు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.మనోహర్‌రెడ్డి ఏఐటియుసి పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఎఐటియసి నాయకులు ఎస్.సలీంభాష, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అష్రఫ్ అలీ, ఎస్.తంబయ్యశెట్టి పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజనేయులు జెండాను ఆవిష్కరించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక, రైతులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామాంజులు, జె.సుకుమారి, ఓబుళమ్మ, ప్రభావతి, ప్రాజెక్టులోని ఐదు మండలాల సెక్టార్ లీడర్లు పాల్గొ న్నారు. **చిట్వేలు:** వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మణి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి అన్ని సంఘాల కార్మికులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనం తరం స్థానిక మండలం ఉప సర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి సిఐ టియు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శుల కె.నాని, యదురూరి సుజాత, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బొజ్జ శివయ్య, కే శివనందు,ఒలిమి నాగయ్య, అంగన్వాడీ వర్కర్స్ , హెల్పర్స్, మ్యాక్సీ అండ్ ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**నందలూరు:** కార్మికుల దినోత్సవం సందర్భంగా సోమవారం గొల్లపల్లి లోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ మండల అధ్యక్షుడు సాంబశివయ్య ఆధ్వర్యంలో జెండాను ఎగురవేసి మేడే దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాలను 12 గంటలకు పెంచితే సహించేది లేదన్నారు. మరో చికాగో ఉద్యమం తప్పదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు అమరావతి, నల్ల తిమ్మయ్య గారి పల్లి వంట ఏజెన్సీ నిర్వాహకులు మునిస్వామి, మహేష్, కార్మికులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండల పరిధిలోని జి.వడ్డిపల్లిలో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శోభ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కలసి మేడే నిర్వహించారు. గ్రామంలో మేడే వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలను కల్పించాలని, కనీస వేతనం రూ.850 ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఎపివివియు మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మదనపల్లె : జెండా ఆవిష్కరిస్తున్న మహిళా నాయకులు


బి.కొత్తకోటలో జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు


చిట్వేలి : సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు


గాలివీడు : జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు


కలకడ : జెండా ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు


మదనపల్లె : మేడే నినాదాలు చేస్తున్న కార్మికులు, నర్సులు


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాలలో వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిపి విజలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలోని సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచనల మేరకు సమావేశంలో గ్రామాలలో తాగునీటి సమస్య, ఉపాధి పనుల్లో కూలీలకు గిట్టుబాటు ఏ విధంగా కల్పించాలనే విషయాలపై చర్చించారు. ఉపాధిహామీలో వేసిన సిమెంట్‌రోడ్లు, బిల్లింగ్‌లకు రూ.98 లక్షలు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలో జరిగే వివిధ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించానేజ గడపకు ప్రభుత్వం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి వచ్చిన సమస్యలపై సమావేశంలో పరిష్క రించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకటరమణ, ఉపాధ్యక్షులు నాగరాణి, రవిశంకర్‌రెడ్డి, ఎంపిడిఒ హైదర్‌వలీ, తహ శీల్దార్ సత్యానంద్, ఎంఇఒ రామకృష్ణుడు, నాగరాణి, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బాబాయ్ కేసు ఛేదించలేని జగన్ : టిడిపి

ప్రజాశక్తి-కురబలకోట

బాబాయ్ హత్య కేసును ఛేదించలేని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఏ విధంగా పాలిస్తారని రాజంపేట పార్లమెంట్ టిడిపి బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. సోమవారం అంగళు టిడిపి కార్యాలయంలో జగణాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వై.ఎస్.వివేకానందరెడ్డి హత్య సూత్రధారులు ఎంత పెద్ద స్థాయిలో ఉన్న వారికి శిక్ష పడకపోతే నర అంతకులు విచ్చలవిడిగా రెచ్చిపోతారని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో నాలుగేళ్లలో ఎస్‌టి, ఎస్‌సి, బిసి, మైనార్టీ వర్గాలపై దాడులు అధికమయ్యాని అన్నారు. సమావేశంలో మాజీ వైస్ ఎంపిపి వెంకటరమణారెడ్డి, బిసి సెల్ నాయకులు రామూర్తి, మాజీ ఎంపిటిసి మోహన్, పార్లమెంట్ కార్యదర్శి మోహన్‌రెడ్డి, వెంకట రమ ణారెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లి కార్జున ,లక్ష్మన్న, గోపాల్ పాల్గొన్నారు.

11 నుంచి ఒపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ,ఆరవ పల్లెలోని జడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్‌లు ముమ్మడి శెట్టి సుధాకర్, పల్లె గ్రీష్మంత రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ అరవపల్లె ప్లే గ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల టీమ్‌లు ఈనెల 8వ తేదీ లోపు రూ.1200 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి, టీమ్ పేరును నమోదు చేసుకోవాలన్నారు. పేరు నమోదుకు 9866015602, 8309199305, నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.50,116, ద్వితీయ బహుమతి రూ.30,116లను అందించడం జరుగుతుంది తెలిపారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్ అవార్డు ఉంటుందని అన్నారు. మ్యాచ్‌లన్నీ నాకౌట్ పద్ధతిలో జరుగుతాయని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని వారు కోరారు.యువతలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీతారాముల గుడికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

రైల్వే కోడూరు మండలం బుడుగుంట పల్లె హరిజనవాడ గ్రామంలో సోమవారం గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత కుమారుడు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కా సాయి వికాస్ రెడ్డి , డిఆర్‌సిసియు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామస్తుల ఆహ్వానం మేరకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నామని అన్నారు. కార్యక్రమంలో బత్తిన వేణుగోపాల్ రెడ్డి, తళ్లెం చంద్రమోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ముక్కవారిపల్లి సర్పంచ్ అరవ శ్రీధర్, గౌతమ్‌లు పాల్గొన్నారు

రేపటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన శ్రీ భువనగిరి పల్లె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మూడవ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు పూల హరిప్రసాద్, కావేరిగారి వెంకటరమణ, నామాల రాజశేఖర్, కంబాయిగారి సుబ్బనరసింహులు, మన్నేరు లక్ష్మీనరసయ్య, కొమ్మూరు సుబ్బ నరసయ్యలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాలుగవ తేదీ గురువారం శ్రీ నరసింహ జయంతి, అభిషేకము, అర్చన, వెండి కవచధారణ, ఉదయం గీతా పారాయణంతో మధ్యాహ్నం, రాత్రి విశేష అన్నదాన కార్యక్రమం ఉంటుందని, శుక్రవారం అభిషేకము, సహస్రనామార్చన, గరుడసేవ.. శనివారం కల్యాణ మహోత్సవం నిర్వహించబడునని తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి సమయాలలో విశేష అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.


ఇదేంఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

అరాచక పాలనను సాగనంపుదాం : టిడిపి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలోఅరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి కోటపల్లి బాబురెడ్డి, మండల అధ్యక్షులు వి. శ్రీకాంత్ రెడ్డిలు పేర్కొన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఇదేంఖర్మ కార్యక్రమం పెండింగ్‌లో ఉన్న గ్రామాల్లో పూర్తిచేయాలని నిర్ణయించారు. నియోజక వర్గ స్థాయిలో పార్టీకి ప్రజాదరణ బాగుందన్నారు. సోమవారం పట్టణంలోని పట్టణంలోని 3, 4వ వార్డుల్లో ఇంటింటికి టిడిపి శ్రేణులు తిరిగి, కరపత్రాలు పంచి, పెరిగిన నిత్యావసరుకుల ధరల గురించి అందరికి వివవరించారు. ప్రజా, కార్మిక సంక్షేమం టిడిపితోనే సాధ్యమని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబును, నియోజకవర్గంలో కిషోర్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి మల్లెలరెడ్డిబాషా, రాష్ట్ర బిసి కార్యదర్శి పురం రామమూర్తి, మాజీ మండల అధ్యక్షులు ఎన్.అమరనాధ రెడ్డి, పీలేరు పట్టణ అధ్యక్షులు డి.సురేష్ కుమార్ రెడ్డి(కంచిసూరి), మాజీ సింగిల్ విండో చైర్మన్ వై.రెడ్డెప్ప రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మీకర, మండల మహిళా అధ్యక్షురాలు పురం రెడ్డెమ్మ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల భవనం ప్రారంభం

ప్రజాశక్తి-నందలూరు


న్యాయవాదు భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్జి

నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి కె.లత సోమవారం సాయంత్రం న్యాయ వాదుల భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి జి.సుబ్బరామయ్య ఉపా ధ్యక్షులు షేక్ మహమ్మద్‌అలీ, జాయింట్ సెక్రెటరీ నాయ నపల్లి అనుదీప్ జైసింహ,ఎజిపి షమీ ఉల్లా ఖాన్, సీనియర్ న్యాయ వాదులు దేవల్ల మల్లికార్జున, ఏవి సుబ్రహ్మణ్యం ఆనంద్ కుమార్, జూని యర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు పట్టుకుంటే షాకే : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కరెంట్ తీగ పట్టుకుంటే షాక్ కొట్టడం సహజమని, వైసిపి పాలనలో కరెంట్ బిల్లు పట్టుకున్నా షాక్ కొడుతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2019లో అధికారంలోకి రాక ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని జగన్ వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక పెం చుడే పెంచుడు, దంచుడే దంచుడు, బాదుడే బాదుడుగా కరెంటు బిల్లులను సిఎం జగన్‌రెడ్డి పెంచుతున్నట్లు విమర్శించారు. ఈ నాలుగేళ్ళలో 7 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై అదనంగా భారం రూ.17,723 కోట్లు వేసినట్లు చెప్పారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.3,082 కోట్లు అదనపు భారం వేయాలని వైసిపి ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. ఈ నిర్ణ యాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే విద్యుత్ వినియోగదారులు జగన్ ప్రభుత్వానికి రివర్స్ షాక్ ఇవ్వక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, నరసింహరెడ్డి, ఉత్తన్న, రామకృష్ణ, శివ, సత్తార్ పాల్గొన్నారు.


సిఐటియులో చేరిన ఆశా కార్యకర్తలు

ఎఐటియుసి నుంచి సిఐటియులో చేరిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పలువురు ఆశా కార్యకర్తలు ఎఐటియుసి నుంచి సిఐటియులో చేరారు. మేడే సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు రేఖ, కవిత, ఇందిరా, ఇంద్రాణి, షీబా, లక్ష్మీదేవి, గౌరమ్మలను సిఐటియు కండువా చేసి ఆహ్వానం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఆశా వర్కర్ల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా రాజీలేని పోరాటం చేస్తోందని, సిఐటియు చేస్తున్న పోరాటాలకు ఆసక్తి కలిగి సిఐటియులో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరీంద్రనాథ్ శర్మ, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మలు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలపై పని భారం పెరిగిందని, పది వేల రూపాయల వేతనం ఇస్తున్నామనే పేరుతో అనేక భారాలను రాష్ట్ర ప్రభుత్వం మోపిందన్నారు. ఆశాలు ఐక్యంగా పోరాడి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత సాధించుకోవచ్చని తెలిపారు. ఆశా కార్యకర్తలు సిఐటియును బలోపేతం చేసుకోవడం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కరింపబడతా వివరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, ఆశ కార్యకర్తలు చంద్రకళ, మల్లీశ్వరి, మంజుల, విమల పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వృద్ధురాలిపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి

- బంగారు, నగదుతో పరారీ

ప్రజాశక్తి-పీలేరు


గాయపడిన వృద్ధురాలు

ఓ గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో చొరబడి ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళపై కత్తితో దాడి చేసి, బంగారు, నగదు దోచుకుని పారారైన సంఘటన పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండుకు సమీ పంలో చోటు చేసుకుంది. సోమవారం ఉదయం జరిగిన సంఘటన వివరాలు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఎదురుగా బి.అనసూయమ్మ(70) అనే వృద్ధ మహిళ నివాసముంటుంది. ఈమె తన ముగ్గురు కుమార్తెలకు వివాహం చేసి అత్తారింటికి పంపింది. పదేళ్ల క్రితం భర్త కూడా చనిపోవడంతో ఒంటరిగానే ఉంటూ గోనె సంచులు, తాళ్లు అమ్మగా వచ్చిన ఆదాయంతో జీవనం సాగిస్తూంది. సోమవారం ఉదయం తన అంగడి తెరవడానికి ముందుగా ఇంటి ముంగిట చెత్త చిమ్మి, కళ్ళాపు చల్లి తిరిగి ఇంట్లోకి వెళ్ళింది. అప్పటికే ఆమె కదలికలపై కన్నేసి ఉంచిన గుర్తు తెలియని ఆగంతకుడు ఆమె వెనకే ఇంట్లోకి చొరబడి, ఆమెపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆమె ఒంటిపై ఉన్న 80 గ్రాముల బంగారు నగలతో పాటు, అంగట్లోని నగదును కూడా తీసుకుని పరారయ్యాడని తెలుస్తోంది. తీవ్రంగా గాయపడివున్న వృద్ధురాలిని స్థానికులు గుర్తించి ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆమెను తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లాకు చెందిన డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం, సిసి పుటేజీ, సాయంతో నిందితుడి ఆనవాళ్ళ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు పేర్కొన్నారు. ప్రధాన రహదారి పక్కనే ఈ ఘటన జరగడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి.